
వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈఓ విజయ కుమారి

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి


సాంస్కృతిక నృత్య ప్రదర్శన

దుండిగల్: విద్యార్థులు నిరంతరం సృజనాత్మకంగా ఆలోచించి సమస్యల పరిష్కారాల కోసం అన్వేషించాలని డీఈఓ విజయ కుమారి అన్నారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక, మేడ్చల్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌ను దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లోని ఎస్ఎస్‌కెకె హైస్కూల్‌లో నిర్వహించారు. శుక్రవారం ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి దాదాపు 280 సైన్స్ ప్రాజెక్టులు ఈ ఎగ్జిబిషన్‌లో భాగమయ్యాయి. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు, ఆటోమేటిక్ కెమెరా కంట్రోల్, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకునే నివారణ చర్యలు, అడ్వాన్స్ టెక్నాలజీ తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకర్షించాయి. 24 మంది విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయడంతో పాటు మొదటి 8 మందిని ఎంపిక చేసి సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి నుంచి 17 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఎంఈఓ కృష్ణ, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఓ రమేష్, ఎస్ఎస్‌కెకె స్కూల్ సెక్రటరీ బాబు, ప్రిన్సిపాల్ సుమాదేవి, వివిధ మండలాల విద్యాధికారులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే క్రిమినల్ కేసులు


ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ హనుమంతరావు

చింతల్: ర్యాగింగ్‌తో తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం ఐడీపీఎల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్‌లో పాల్గొనే అందరిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మంచి విలువలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ డీఐ కనకయ్య, ఎస్ఐలు నాయుడు, హరీష్, సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్లు నల్ల జై శంకర్ గౌడ్, గోవిందారెడ్డి, వెంకట్ రెడ్డి, రామకృష్ణ, రమేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, గ్లాండ్ ఫార్మా యూనియన్ అధ్యక్షుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం గ్లాండ్ ఫార్మా ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్మికులకు పరిశ్రమ నుంచి అందాల్సిన అలవెన్స్‌లు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, నరేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రమాదేవి, కార్మికులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్, టెన్నిస్ జట్ల ఎంపిక


స్విమ్మింగ్ పోటీలో పాల్గొన్న మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లోని ఇండోర్ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్‌లో మెన్ అండ్ ఉమెన్ ఆల్ ఇండియా సెలక్షన్ ట్రయల్స్‌ను శుక్రవారం నిర్వహించారు. అదే విధంగా టేబుల్ టెన్నిస్ జట్టును కూడా ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన స్విమ్మింగ్ క్రీడాకారులు డిసెంబర్ 21 నుంచి 23 వరకు ఎస్ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు తమిళనాడులో డిసెంబర్ 10 నుంచి 14 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ, యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్ పాల్గొన్నారు.


టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

దూలపల్లి రోడ్డు మరమ్మతులేవీ?


రోడ్డుపై వాహనాల రద్దీ


కంకర తేలిన జీడిమెట్ల - దూలపల్లి రోడ్డు

- 300 మీటర్ల మేర రోడ్డు ధ్వంసం
- కంకర తేలి గుంతలుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డు ఇండస్ట్రీయల్ గేటు వెలుపల 300 మీటర్ల మేర కంకర తేలి గుంతలు ఏర్పడింది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రయాణికులు, వాహనదారులు జంకుతున్నారు. కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల టూ దూలపల్లి రోడ్డు హైవే 44 నుంచి దూలపల్లి పారిశ్రామిక ప్రాంతానికి రావడానికి ఈ రోడ్డు దగ్గరగా ఉంటుంది. దీంతో ఈ రోడ్డు ద్వారా ప్రతి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధిక లోడుతో వచ్చే వాహనాలు ఒక్కోసారి గుంతల్లో ఇరుక్కుని అక్కడే ఆగిపోతున్నాయి. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ములేచి నేరుగా రోడ్డు పక్కన షాపుల్లోకి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు నిర్మిస్తే వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించడానికి అనువుగా ఉంటుంది. ఇప్పటికైనా కొంపల్లి మున్సిపల్ అధికారులు పట్టించుకుని రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం



ప్రతినిత్యం ఇదే రోడ్డులో కనీసం మూడుసార్లైనా లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం తిరుగుతాను. 300 మీటర్ల మేర ఉన్న రోడ్డులో సీసీ రోడ్డు వేస్తే బాగుంటుంది. రోడ్డుపై పూర్తిగా గుంతలు ఉండటంతో వాహనాలు తరచూ రిపేరుకు వస్తున్నాయి. అధికారులు పట్టించుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– శ్రీకాంత్, ట్రక్కు డ్రైవర్

అధికారులు పట్టించుకోరా?



10 సంవత్సరాల నుంచి ఇదే రోడ్డులో డ్రైవింగ్ చేస్తున్నాను. ప్రతినిత్యం జీడిమెట్ల నుంచి దూలపల్లి, కొంపల్లి వెళ్లాల్సి వస్తుంది. మూడు సంవత్సరాలుగా రోడ్డు ధ్వంసమైనా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం ప్రజాప్రతినిధులైనా పట్టించుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– తాజుద్దీన్, డ్రైవర్

రేపు కార్తీక వన భోజనాలు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ భట్రాజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గాజులరామారం నల్లగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక వన భోజనాల మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం భట్రాజ సంఘం జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు, రాధాకృష్ణ భట్ ఓ ప్రకటన విడుదల చేశారు. కుటుంబ, వివాహ పరిచయ వేదికతో పాటు మెరిట్ సాధించిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో పనులు చేపడతామన్నారు. అదే విధంగా సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

మేయర్‌కు ఆహ్వానం

నిజాంపేట్: నిజాంపేట్‌కు చెందిన ఎల్లమ్మ నాగదేవత ఆలయ ధర్మకర్త మేకల నాగేశ్ శుక్రవారం మేయర్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నిర్వహించే అన్న సమారాధనకు హాజరు కావాలని కోరారు.

27న సామూహిక సత్యనారాయణ వ్రతం

రంగారెడ్డినగర్ : కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో 27న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు పూజారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం ప్రారంభమవుతుందని, వివరాలకు 7386719214 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో కలిసి సమస్యలను విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా వివిధ శుభకార్యాలు, అయ్యప్ప స్వామి మహాపడి పూజలకు హాజరు కావాలని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఓల్డ్ బోయిన్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు బీబీఆర్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలో ఫిరోజ్‌గూడ, కోయబస్తీ, గవర్నమెంట్ స్కూల్, పోచమ్మ టెంపుల్, అనంతమ్మగూడ, పూల్ బాగ్, ఉదయం 11:30 నుంచి 12 గంటల వరకు, 33/11 కేవీ హెచ్ఎంటీ సబ్ స్టేషన్ గణేష్‌నగర్ ఫీడర్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్, భూదేవి నగర్ సబ్ స్టేషన్ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు రామ్ రాజనగర్, ఎండీఎఫ్ రోడ్డు, శంకర్ ఎన్‌క్లేవ్, సమతా నగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఘన్‌రాక్ సబ్ స్టేషన్ ఎండీఎఫ్ ఫీడర్ పరిధిలోని మానస సరోవరం ఫేజ్ 1, ఫేజ్ 2, ఫేజ్ 3, ఎల్‌బీ నగర్, జీపీ సంఘం, భవానీ నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సుభాష్‌నగర్: శిథిలమైన విద్యుత్ స్తంభాల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మినీ ఇండస్ట్రీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్ఎం నగర్ రోడ్డు, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, హాజీ అలీ మజీద్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జగన్ స్టూడియో ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్ఆర్ఐ కాలనీ, విష్ణుప్రియనగర్, అక్షర స్కూల్, గౌతమ్ మోడల్ స్కూల్, 11కేవీ ఏజీఎల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఎస్‌బీఐ కాలనీ, సప్తగిరి ఎన్‌క్లేవ్, మైస్పేస్-2, ఎస్ఆర్ఆర్ హైట్స్, సన్‌యుగ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నిజాంపేట్: రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు శ్రీహోమ్స్ కాలనీ, క్రాంతినగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జయకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ: ప్రతి విద్యార్థికి సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంటర్ సాఫ్ట్ సొల్యూషన్స్ సెక్యూరిటీ కన్సల్టెంట్ జయకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 'బ్లూ టీం సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ వ్యవహారాల నిర్వహణలో యూనిక్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం తప్పనిసరి అని అన్నారు. నకిలీ ఈ మెయిల్స్‌తో దృష్టిని ఆకర్షించే లింక్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. రద్దీ, బహిరంగ ప్రాంతాల్లో ఉచితంగా వస్తున్న వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించకుండా ఉండటం మంచిదన్నారు. ఎప్పటికప్పుడు యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 62 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణ సూరి సమక్షంలో ఉదయం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రగతిశీల రైతులకు | మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ


మొబైల్ అప్లికేషన్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రగతిశీల రైతులకు శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ హైదరాబాద్ నుంచి సంబంధిత వ్యవసాయశాఖ నిపుణులు ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో మొబైల్ అప్లికేషన్ ఉపయోగాలు, తెగుళ్ల నివారణ గురించి రైతులకు వివరించారు. ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా రైతులు ఎలాంటి ఆలస్యం లేకుండా తెగుళ్లను సులభంగా గుర్తించటంతో పాటు తక్షణ నియంత్రణ చర్యలను అనుసరించవచ్చునని పేర్కొన్నారు. పురుగుమందు ఖర్చులు తగ్గిస్తుందని, పంట తెగులును సమర్థవంతంగా పర్యవేక్షించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తక్షణమే సలహాలను పొందవచ్చన్నారు. ఈ మొబైల్ అప్లికేషన్‌ను రైతులు ప్రత్యక్షంగా వీక్షించటం కోసం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటరెడ్డి, సునీత, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, వ్యవసాయశాఖ నుంచి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి చంద్రకళ, మండల వ్యవసాయశాఖ అధికారులు వెంకటరామిరెడ్డి, శిరీష, ఎంపీఓలు, ఏపీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా పాలన విజయోత్సవ సభ

కుత్బుల్లాపూర్: ప్రజా పాలనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా హెచ్ఏఎల్ కాలనీలోని సిటీ ప్యాలెస్‌లో శనివారం ఉదయం ప్రజా పాలన విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ప్రజా పాలన కళాయాత్ర


ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న కళాకారులు

నిజాంపేట్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో 'ప్రజా పాలన కళాయాత్ర' నిర్వహించారు. ఇందులో భాగంగా బాచుపల్లి, నిజాంపేట, ప్రగతినగర్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటలతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పవన్, సుమన్, కళాకారులు పాల్గొన్నారు

విద్యార్థులు వాయుసేనలో చేరాలి


వాయుసేన వింగ్ కమాండర్ ప్రీతికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల డైరెక్టర్

కుత్బుల్లాపూర్: విద్యార్థులు దేశ సేవ చేయడానికి వాయుసేనలో చేరాలని వాయుసేన డిఫెన్స్ వింగ్ కమాండర్ ప్రీతి అన్నారు. శుక్రవారం కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీ జూనియర్ కళాశాల విద్యార్థులకు వాయుసేన సేవలపై అవగాహన కల్పించారు వాయుసేనలో చేరడానికి అర్హతలు, అగ్నిపథ్‌లపై వివరించారు. కార్యక్రమంలో వాయు వింగ్ కమాండర్ సందీప్, ప్రొఫెసర్ ఫాదర్ విన్సంట్, కాలేజీ డైరెక్టర్ నరిశెట్టి సుందర రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు


పరీక్ష ఫీజును అందజేస్తున్న సభ్యులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పరీక్ష ఫీజును అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం చెల్లించారు. 30 మంది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు రూ.6 వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. కార్యక్రమంలో వీరయ్య, పరశురాముడు, నవీన్‌కుమార్, మల్లేష్, రుద్ర అశోక్ పాల్గొన్నారు.

సామూహిక కార్తీక దీపోత్సవం



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా దేవాదాయశాఖ ఆదేశానుసారం నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో కీసర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈసీ విద్యార్థికి గోల్డ్ మెడల్



విశ్రుతను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విశ్రుత ఇటీవల నగరంలోని కాచిగూడ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 69 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థిని విశ్రుతను కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మహ్మద్ నౌషద్ అలం(ఫైల్)

నిజాంపేట్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లికి చెందిన మహ్మద్ నౌషద్ అలం(40) ఉదయం 11 గంటల ప్రాంతంలో బాచుపల్లి ఇండస్ట్రీయల్ రోడ్డులోని ఓ టింబర్ డిపోలో క్రేన్‌పై పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.